# 'వైతరణి'

పదిహేనో సంవత్సరంలో పదవతరగతి పాసయినప్పటి నుంచీ వదిలవ్మైన ఉద్యోగం ఒకటి సంపాదించుకోవాలనే ప్రయత్నం ప్రారంభించాన్నేను. నా అవసరం అలాంటిది మరి. అలాగని చదువుకు స్వస్తి చెప్పలేదు. ఇంటర్మీడియెట్‌లో చేరాను. చదువు కొనసాగిస్తూనే ప్రభుత్వం వారూ ప్రభుత్వరంగ సంస్థల వారు నిర్వహించే వ్రాత పరీక్షలకు హాజరవుతూ నా అదృష్టాన్ని పరీక్షించుకోవటం అలవాటు చేసుకున్నాను. ఉద్యోగాలకు అర్హతకంటే కూడా అదృష్టమే ముఖ్యమై పోయిందనే విషయం అందరికీ తెలిసిందేగా!

కాలచక్రంలో రెండు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయినై. నేను ఇంటర్మీడియేట్ కూడా పదవ తరగతిలాగానే ఫస్టు క్లాసులో పాసయ్యాను. రెట్టించిన ఉత్సాహం ఓ పక్కన, డిగ్రీలో నాకు ఇష్టమైన గ్రూపులో చేరేటందుకు సరిపడని ఆర్థిక స్థోమత ఓ పక్కన. ఆ రెండింటికి మధ్యన, మధ్యేమార్గంగా ఏదయినా డిగ్రీయే గదా అని సరిపుచ్చుకుని ఇంగ్లీషు వ్యాకరణంలోని డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్ ఓసారి తలచుకొని, పరిస్థితులకు తలవొంచాను, 'అందుక్కూడా అవకాశం లేని ఎంతోమంది కంటే నేను నయం కదా" అనుకుని.

అయితేనేం పోటీపరీక్షలకు హాజరుకావటం మాత్రం మానలేదు. డిగ్రీ రెండో సంవత్సరం చేరుకునేసరికి రెండు మూడు వ్రాత పరీక్షల్లో విజయం సాధించి ఇంటర్వ్యూ దాకా చేరుకున్నాను. అక్కడ నెగ్గలేకపోయినా నాలో ధైర్యం చోటుచేసుకున్నది. డిగ్రీ పూర్తయిన వెంటనే ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోగలనన్న నమ్మకం బలపడింది. ఇంటర్వ్యూ దాకా వెళ్ళగలిగానన్న ఉత్సాహం నన్ను మరింత ప్రోత్సాహపరిచింది. డిగ్రీ మూడో సంవత్సరం

పరీక్షలయ్యాక, పూర్తి సమయాన్ని లైబ్రరీలో గడపటానికి అలవాటు పడ్డాను. ఈ పోటీ ప్రపంచంలో ముందుకు, ముందుకు, ముందుకు వీలయినంత ముందుకు చేరి ముద్దకు దిగుల్లేని స్థాయికి చేరుకోవాలని మాత్రమే నా ఆరాటం, తపన.

తప్పదు మరి. చదువుకునే వాళ్లూ, చదువు కొనేవాళ్లూ ఉన్నప్పుడు ఉద్యోగాలు కొనేవాళ్లూ, అమ్మేవాళ్లూ ఉన్నప్పుడు, ఉద్యోగాలు దొరకడం లాటరీలాంటిదైన ఇప్పుడు... పైగా ఉద్యోగాలు చేయాలా? "ఊళ్ళు ఏలాలా అనుకోని ... ఇప్పుడు...ఈ పోటీల్లో... ఈ కోటాల్లో... ఈ కాటాల్లో తూనికరాయి ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు, ఎలా మొగ్గు చూపిస్తుందో తెలియని ఇప్పుడు.... ఆమాత్రం తపనా, తాపత్రయం లేకపోతే ఎట్లా?

ఉద్యోగం వచ్చింది కాబట్టి చేస్తున్నవాళ్ళు లక్షల్లో ఉన్నారట. టైంపాస్‌కోసం చేస్తున్న వాళ్ళు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారట. ఉద్యోగం మూలంగా వచ్చిన స్థాయిని, గుర్తింపుని ఒదులుకోలేక చేస్తున్నవాళ్ళు ఉన్నారట. వీళ్ళందరి మధ్యనా అన్నం కోసం ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళు ఎంతమంది ఉన్నారట. అదుగో ఆ కొద్దిమంది వల్లే ఈ యంత్రాంగం అంతా ఈ మాత్రంగానైనా నడుస్తున్నదట.

ఇలా అవసరంకోసమే ఉద్యోగాలు చేస్తూ, చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేస్తూ బ్రతుకుబండి లాగుతున్నవారిని గానుగెద్దులూ అంటారనీ, సరదాగా ఉద్యోగం వెలగబెడుతూ కాలక్షేపం చేసే కాకారాయుళ్లని గంగిరెద్దులంటారనీ మా పక్కింటి రిటైర్డ్ మాష్టారోసారి చెప్పిన విషయం గుర్తొచ్చి నవ్వుకున్నాను.

గానుగెద్దులకు పని చేయటం తప్ప మరోటి తెలియదట. గంగిరెద్దులకు తల ఊపటం తప్ప మరేమీ తెలియవుట. పైవారు చెప్పిన ప్రతిదానికి తలలు ఊపి పదవులు, ప్రమోషన్లు వాళ్లు దక్కించుకుంటే గానుగెద్దుల్నుంచి పని పిండుకుంటారని ఆయన విశ్లేషించి చెప్పటం నాకు నచ్చింది.

మొత్తం మీద డిగ్రీ కూడా ప్రథమశ్రేణిలో పాసయ్యాన్నేను. ఎప్పటికప్పుడే ప్రశ్నాపత్రాల లీకేజికి భయపడటం, వ్రాసిన పరీక్షనే మళ్లీ వ్రాయవలసి వస్తుందేమోనన్న భయం, సకాలంలో అందని పాఠ్యపుస్తకాలు, సజావుగా జరగని కాలేజీ తరగతులు, ప్రయివేట్లలో తప్ప ప్రభుత్వ కళాశాలల్లో చదువు చెప్పమని బాహాటంగా చెప్పేస్తున్న అయ్యవార్లు, సమ్మెలు, బంద్‌లు అన్నింటినీ ప్రయివేటీకరణ చేసేస్తామంటున్న ప్రభుత్వంవారు పాఠ్యపుస్తకాల

ప్రచురణను ఎందుకు ప్రయివేటీకరించరో అర్థం కాదు. పరీక్షలు వ్రాసిన విద్యార్థుల ఉత్తీర్ణత నిర్ణయించటానిక్కూడా రకరకాల విభజనలు, రకరకాల విభక్తులు, ఎవ్వరికీ అనేందుకు ధైర్యం చాలదు, అనకుండా ఊర్కునేందుకు ఓర్పు చాలదు. ఇలాంటి అస్తవ్యస్థ వాతావరణంలో కేవలం ప్రతిభతోనే పట్టా పుచ్చుకున్నానన్న గర్వంతో, సంతృప్తిగా చదువులో ఓ స్థాయికి చేరుకున్న నేను అప్పట్నుంచి మరింత ముమ్మరంగా ప్రకటన వెలువడిన ప్రతి పోటీ పరీక్షకు హాజరయ్యాను. నిజానికి ఆ పరీక్షల్లో పాల్గొనేందుకు కట్టవలసిన ఫీజులక్కూడా నా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అయినా తప్పదు. ఇక్కడ నాకింకో ధర్మ సందేహం వస్తుంది. ప్రభుత్వం వారు వంట గ్యాసు మీదా, కిర్సనాయిలు మీదా... ఇంకా... ఇంకా వస్తువుల మీద సబ్సిడీ ఇస్తున్నారు గదా (అఫ్‌కోర్స్ ఇప్పుడవన్నీ ఒక్కొక్కటిగా ఎత్తివేస్తున్నారనుకోండి) ఉద్యోగం చేయగల వారు ప్రభుత్వ యంత్రాంగానికి అవసరం కాబట్టి ఇది ఇరువురికి అవసరమైనది కాబట్టి పోటీ పరీక్షలకు ఫీజు ఎందుకు? నిరుద్యోగులందరూ ఉచితంగా పోటీ పరీక్షల్లో పాల్గొనవచ్చని ప్రకటించే ప్రభుత్వం ఉద్యోగస్థులనుండి మరో అయిదు రూపాయలు అదనంగా వసూలు చేసే ఆలోచన సమంజసంగా ఉంటుందేమో ననిపిస్తున్నద నేను నిరుద్యోగిని కాబట్టి.

డిగ్రీ పూర్తయ్యాక పెద్దన్నయ్య ప్రోత్సాహంతో ఓ ప్రయివేటు కంపెనీలో చిరుద్యోగం సంపాదించిన నేను ప్రతి పోటీ పరీక్షకు వెళుతూ ఎప్పటికప్పుడు నా అదృష్టాన్ని పరీక్షించుకుంటూనే ఉన్నాను. అలా అలా చకోరపక్షిలా అవకాశం కోసం ఎదురుచూస్తున్న నాకు ఓ శుభ(?) ముహూర్తంలో పోటీ పరీక్షల్లో నెగ్గినట్లు ప్రకటన వచ్చింది. ఆ రోజు నా ఆనందానికి అవధుల్లేవనే చెప్పాలి. అప్పటికే మరో రెండు పరీక్షలు కూడా వ్రాసి ఉన్నాను. నాటి ఫలితాలు కూడా త్వరలో తెలుస్తాయని తెలిసింది.

ఫలితాలు తెలిసిన రెండు మాసాలక్కాబోలు ఇంటర్వ్యూకి రమ్మంటూ పిలుపు వచ్చింది. నాలో కొత్త ఉత్సాహం చోటు చేసుకున్నది. చేస్తున్న ఉద్యోగానికి శెలవు పెట్టి లైబ్రరీలోనే ఎక్కువ సమయం గడపనారంభించాను. ఎలాగయితేనేం బాలారిష్టాలన్నింటిని దాటి చదువు డిగ్రీ వరకు పూర్తిచేసిన పోటీ పరీక్షలు వ్రాసి వ్రాసి ఎట్టకేలకు ఇంటర్వ్యూ దాకా లాక్కురాగలిగేను స్వయం కృషితో అన్ని ఆలోచన నాలో ఆత్మ విశ్వాసాన్ని మరింత పెంచింది.

సదరు ప్రభుత్వ విభాగంవారు రమ్మన్న తేదీకి రమ్మన్న ప్రదేశానికి వెళ్లాను ఉత్సాహంగా. నిర్ణీత సమయానికంటె గంట ముందుగానే అక్కడకు చేరుకున్నాను. అప్పటికీ అభ్యర్థులు కొందరు వచ్చి ఉన్నారు. నా తర్వాత కూడా మరి కొందరు చేరుకున్నారు.

ఇంచుమించు అందరిదీ ఒకటే వయసు. వచ్చిన వాళ్లందరూ ఒకరికి ఒకరు పోటీ అయినప్పటికీ పరిచయాలూ, గట్రా జరిగిపోయినై. అవసరం ఉన్న వాళ్లెవరో, హాబీగా వచ్చిన వాళ్లెవరో పరమాత్ముడికెరుక. మా ఉద్యోగ ప్రాప్తం మాత్రం ఆ విభాగానికి అధిపతి అయిన ఓ మానవమాత్రుడిదే!

అక్కడ చేరిన అభ్యర్థుల్లో ఆడవారు కూడా ఉన్నారు. అక్కడికక్కడ చేసుకున్న పరిచయాల్తో జట్లుజట్లుగా చేరి ఏవేవో ముచ్చట్లు. అందర్లోనూ ఏవేవో ఆలోచనలు, ఎన్నెన్నో ఆశలు, మరెన్నో అనుమానాలు, ఆందోళన, అలజడి, ఆశ, నిరాశ, ఎవరికివారికే ఏదో తెలియని ఉద్విగ్నత.

ఓ అరగంట తర్వాత అక్కడికి వచ్చి ఆగిన జీపులోంచి ఓ ఇద్దరు వ్యక్తులు దిగారు. మాష్టారి భాషలో చెప్పాలంటే ఓ గంగిరెద్దు, ఓ గానుగెద్దు అనుకోవచ్చేమో? మా అందర్లోనూ ఓ రకమైన బిడియం.

ఆఫీసు గది తలుపులు తెరుచుకున్నాయ్. జీపు డ్రైవరు ద్వారాను, గుమాస్తాగారి ద్వారా తెలుసుకున్న విషయం ఏమిటంటే మమ్మల్ని ఇంటర్వ్యూ చేసే అధికారి మరో గంటకి వస్తాడని, ఇంత క్రితం జీపులో వచ్చిన పెద్ద మనిషి ఆ ఆఫీసుకు ఇన్‌చార్జ్ అని. మాతో తెచ్చుకున్న ఇంటర్వ్యూ లెటర్స్. మా బయోడేటా వగైరాలన్నీ గుమాస్తాగారు అడిగి తీసుకున్నారు. అన్నింటినీ సర్ది చేత పుచ్చుకుని లోపలికి వెళ్ళిపోయాడాయన.

ఆఫీసు గది ముందు గుంపుగా చేరిన మమ్మల్నందర్నీ దూరంగా వెళ్లమని గదమాయించాడు అప్పుడే వచ్చిన నాలుగోతరగతి ఉద్యోగి. అయిదు నిమిషాల్లో మరల జట్లు జట్లుగా విడిపోయి కబుర్లాడసాగాం అందరం.

సరిగ్గా ఆ సమయంలో, లోపల్నుంచి దర్జాగా బయటకు వచ్చాడు ఇన్‌చార్జ్ ఆఫీసర్‌గారు. దగ్గర్లో ఉన్న అభ్యర్థులంతా నమస్కారాలు చేశారు. వినయంగా దూరంగా నిల్చున్న వాళ్లందరం కూడా విడివిడిగా అటుగా వెళ్లి ఆయన గారికి అభివాదం చేశాం. అందరివంకా నిశితంగా చూస్తూ తలాడించారాయన మా అభివాదాలకు బదులుగా.

"ఏమయ్యా పోస్టుగ్రాడ్యుయేషన్ చేసినవాళ్లు కూడా ఈ ఉద్యోగాలకి సిద్ధపడ్డారేంటయ్యా. ఎక్కడెక్కడ్నుంచో వచ్చారు. ఏం చేద్దామని ఇంత దూరం

వచ్చి ఈ ఉద్యోగం చేసే కంటే ఉన్న 'ఊళ్లో' ఉల్లిపాయలమ్ముకోండయ్యా. బాగుపడతారు. ఈ వెట్టిచాకిరీ మీరేం చేస్తారు."

ఓ రెండు మూడు నిమిషాలు నిశ్శబ్దం.

ఆడపిల్లల వైపు నాలుగు అడుగులు వేశాడాయన.

"ఏమ్మా మీరు కూడా వచ్చేరే. నా మాట విని ఇంటికి వెళ్లి ఇంకో ఉద్యోగం వచ్చేవరకు అంట్లు, చెంబులు తోముకోండి మీ వల్ల ఏమవుతుందీ డిపార్ట్‌మెంటులో ఉద్యోగం చేయటం? మేమే ఎందుకు చేరేమా అని తల బాదుకు ఛస్తున్నాం. మీక్కూడా ఎందుకు చెప్పండి. చాలా అవస్థపడతారనే చెప్తున్నా. మీ వల్ల కాదు ఈ పని. ఇంత నీచపు డిపార్ట్‌మెంట్ ఇంకొకటి లేదంటే నమ్మండి."

శ్రద్ధగా వింటున్న అంగరూ గట్టిగా ఊపిరి పీల్చుకు వదిలారు. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. చాలామంది ముఖాల్లో భయం స్పష్టంగా కన్పించింది.

నిజం చెప్పొద్దూ అయన మీద నాకు చాలా కోపం వచ్చింది. ఎందుకో తెల్సా ఆయన చేస్తున్న శల్య సారధ్యానికి, ఎన్ని అవాంతరాలను, ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొని, ఎట్టకేలకు అక్కడికి చేరామో ఆయనకేం తెలుసు. బ్రతుకు తెరువుకోసం ప్రాకులాడుతున్న నాబోటివాళ్ళకు ఆయన మాటలు రుచించలేదు. వ్రాత పరీక్షల పోటీలో నెగ్గుకు రాగలిగాం. ఇంటర్వ్యూలో కొంతవరకు నెగ్గుతాం, ఇంకేమైనా పోటీ ఉంటే మరికొందరయినా మిగిలి ఉద్యోగం పొందుతాం. అది స్వర్గంలా ఉంటుందో, నరకంలా ఉంటుందో తర్వాతి సంగతి. ముందర ఈ వైతరణిని దాటటం ఎట్లా? ఈ శల్య సారథ్యాన్ని సహించటం ఎట్లా? నాలో ఆవేశం కట్టలు తెంచుకుంటున్నది.

అదే డిపార్ట్‌మెంట్‌లో ఎన్నాళ్లుగానో పనిచేస్తూ, వేలల్లో జీతం తీసుకుంటూ, తనకు అన్నం పెడుతున్న సంస్థను అంత చులకన చేసి మాట్లాడుతున్న ఆయన పట్ల నాకు హేయభావం కలిగింది.

సంఘంలో ఆయనకో గుర్తింపుని, అధికారాన్ని గౌరవాన్ని కలిగిస్తున్నది ఆ ఉద్యోగమే. ఇంతక్రితం దిగిన జీపులో ఎక్కి తిరిగే అవకాశం కల్పించిందీ ఆ ఉద్యోగమే. హోదా అంతస్తు ఆదాయం కల్పించింది ఆ ఉద్యోగమే. అలాంటి పవిత్రమైన దాన్ని అంత పలుచని చేసి పలకటం క్షమార్హం కాదనిపించింది. పాలు తాగి రొమ్ములు గుద్దే పాపాత్ములంటే ఇలాంటి వాళ్లేననిపించింది. చేస్తున్న వృత్తినీ, ఉద్యోగాన్ని మాతృసమానంగా భావించేవాడు మనిషి. తద్భిన్నంగా ప్రవర్తించే ప్రతివాడు పశువు కంటే హీనం అనిపించింది.

కొత్తగా ఉద్యోగంలో చేరే వాళ్లని ఉత్సాహపరచాల్సింది పోయి వాళ్లని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్న అతగాడు క్షంతవ్యుడు కాడనిపించింది. అంత పెద్ద హోదాలో ఉన్న మనిషి ఆ డిపార్ట్‌మెంట్‌లో ఏమైనా అవకతవకలు ఉంటే వాటిని సరిదిద్దేందుకు ప్రయత్నించాలి. సంస్థని బాగు చేసేటందుకు తన పరిధిలో చేయగలిగినదంతా చేయాలి గాని చేతకానివారు, చేవలేనివారు మాత్రమే ఆ డిపార్టుమెంటులో ప్రవేశిస్తారని చెబుతూ తనకు తనే ఓ పనికిమాలిన మనిషిగా చెప్పుకుంటున్నాడు పాపం.

అతగాడికి మాట ఎలా ఉన్నా నాకు ఆ ఆఫీసులో ఉద్యోగం లభించలేదు. అందుకు నేనేం కృంగిపోలేదు. మరో ఆరు నెలలకు ఇంకో పిలుపు వచ్చింది. రెట్టించిన ఉత్సాహంతో హాజరయ్యాను. సెలక్ట్ కూడా అయ్యాను. ముచ్చటగా మూడు రోజులు వ్యవధిలో ప్రభుత్వోద్యోగంలో చేరాను. వైతరణిని దాటిన నేను నాకు దొరికిన ఉద్యోగాన్ని అపురూపంగా చూసుకోవాలని కృతజ్ఞుడినై ఉండాలని స్థిరంగా నిశ్చయించుకున్నాను.

◆ ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రిక - **05.06.2002** ◆